పాఠం 21

# సమకాలీన సామాజిక ఉద్యమాలు

ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటున్న అనేక ఉద్యమాలను మీరు చూసి ఉండవచ్చు. ఒక సమస్యను ఎంచుకొని, దాంట్లో మార్పు తీసుకురావాలన్న ఉద్దేశంతో ఆ ఉద్యమం మొదలుపెడతారు. ఇటువంటి ఉద్యమాల్లో మీరు పాల్గొని ఉండవచ్చు. వార్తాపత్రికలలో చదివిన లేదా మీరు పాల్గొన్న ఉద్యమాలను గుర్తుకు తెచ్చుకోండి. సమస్యలు ఏమిటి, దాని వల్ల ఎవరు ప్రభావితులయ్యారు, వాళ్ల కోరికలు ఏమిటి, ఉద్యమానికి నాయకత్వం ఎవరు వహించారు, ఉద్యమంలో చేరమని ప్రజలని ఎలా ప్రోత్సహించారు, ఉద్యమంలోపల ఏవైనా అభిప్రాయబేధాలున్నాయా, ఉద్యమం ఎలా కొనసాగింది, తన ఉద్దేశాలను అది ఎంతవరకు సాధించింది?

## నేపథ్యం

20వ శతాబ్దం తొలి సగంలో ప్రపంచంలో యుద్ధాలు, విప్లవాలు, జర్మనీ ఫాసిజం, సోవియట్ సోషలిజం, పాశ్చాత్య ఉదారవాదం, జాతీయ విముక్తి పోరాటాలు వంటి ముఖ్యమైన ఘటనలు సంభవించాయి. అయితే 1950ల మధ్య నాటికి రెండవ ప్రపంచ యుద్ధం ముగియటం, భారతదేశం, చైనా, ఇండోనేసియా, నైజీరియా, ఈజిప్టు వంటి వలస, అర్ధవలస దేశాలు స్వతంత్రం కావటంతో ప్రపంచంలో ఒక కొత్త యుగం ఆరంభమయ్యింది. అనేక దేశాలలో ఇది ఆర్థిక ప్రగతి, సంపదల యుగంగా ఉంది. అయితే దీర్ఘకాలంగా సమాన హక్కులకు నోచని వాళ్లు తమ హక్కులు కోరుతూ ముందుకు రావటంతో ఇది అనేక దేశాలలో లేదా సమాజంలోని వర్గాలలో ఉద్రిక్తతలు నెలకొన్న కాలం కూడా.


## 1960లలోని పౌరహక్కులు, ఇతర ఉద్యమాలు

ఇటువంటి ఉద్యమాల్లో అత్యంత ముఖ్యమైనది అమెరికాలోని పౌరహక్కుల ఉద్యమం. పాఠశాలల్లో, బస్సులలో బహిరంగ ప్రదేశాలలో నల్లజాతి వాళ్లను వేరుగా ఉంచటానికి, ఉద్యోగాలలో, గృహ వసతిలో, ఓటు హక్కులో సైతం వాళ్లపట్ల వివక్షత చూపటానికి వ్యతిరేకంగా ఆఫ్రో–అమెరికన్లు లేదా నల్లజాతి అమెరికన్లు సమానత్వానికి చేపట్టిన పోరాటం ఇది. ఈ పోరాటం 1960లలో తీవ్ర దశకు చేరుకుంది. పెద్ద ఎత్తున ప్రదర్శనలు, ఊరేగింపులు, 'పౌరనిరాకరణ' (వివక్షతతో కూడిన చట్టాలను శాంతియుతంగా ఉల్లంఘించటం), వివక్షతతో కూడిన సేవల (శ్వేతజాతి, నల్లజాతి వాళ్లకి వేరువేరుగా సీట్లు ఉన్న బస్సుల



*చిత్రం 21.1: ఎలిజబెత్ ఎక్‌ఫోర్డ్ అన్న నల్లజాతి అమ్మాయి 1957 సెప్టెంబరు 4న లిటిల్ రాక్ స్కూల్ ప్రవేశించటానికి ప్రయత్నిస్తున్న చిత్రం. ఫోటో : విల్ సి*

చిత్రం 21.2 మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్



వంటి వాటి) బహిష్కరణలతో ఈ ఉద్యమం శాంతియుతంగా కొనసాగింది. వీటిల్లో ముఖ్యమైనది డా॥ మార్టిన్ లూథర్ కింగ్ నేతృత్వంలో మాంటగోమెరీలో సంవత్సరంపాటు నల్లజాతీయులు బస్సులను బహిష్కరించటం. దీనివల్ల బస్సులు నడిపే కంపెనీ తీవ్రంగా నష్టపోయింది. అంతిమంగా 1956లో బస్సులలో వివక్షతను న్యాయ స్థానాలు నిషేధించక తప్పలేదు. అదే సమయంలో నల్ల జాతీయులకు, తెల్ల జాతీయులకు వేరు వేరు పాఠశాలలు ఉండటానికి వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడుస్తోంది.

1963 ఆగస్టు 28న రెండు లక్షలకు పైగా ప్రజలు వాషింగ్టన్‌కి ప్రదర్శనగా వెళ్లి పౌరహక్కుల చట్టాన్ని చేయాల్సిందిగా కోరారు. ఉపాధి కల్పనకు కార్యక్రమాలు, పూర్తి న్యాయమైన ఉపాధి, మంచి గృహవసతి, ఓటు హక్కు, శ్వేతజాతి, నల్లజాతి పిల్లలు కలిసి చదువుకునే సమ్మిళిత విద్యాసదుపాయాలు వంటివి వీళ్ల ప్రధాన కోరికలు. ఈప్రదర్శనలో ఇతరులతో పాటు డా॥ కింగ్ ఉపన్యసించాడు. "నాకొక కల ఉంది..." అన్న అతడి చరిత్రాత్మక ఉపన్యాసం చేశాడు. ఆ తరువాత కాలంలో నల్ల జాతీయుల కోసం చట్టాలు చేశారు. సుదీర్ఘ పోరాటం తరువాత ఇవి సమర్థంగా అమలు కాసాగాయి కూడా. సంస్కరణలు, మార్పుకోసం అహింసాత్మక సామాజిక ఉద్యమాలకు ఇది ప్రపంచ వ్యాప్తంగా ప్రేరణగా నిలిచింది.

**నాకొక కల ఉంది...**

వంద సంవత్సరాల క్రితం విముక్తి ప్రకటనపై సంతకం చేసిన మహనీయుడి నీడలో ఈ రోజు మనం నిలబడి ఉన్నాం. అన్యాయపు మంటల్లో కాలిపోతున్న నల్లజాతీయులకు ఈ చారిత్రాత్మక పత్రం ఒక ఆశాదీపంలాగా కనిపించింది... కానీ, వంద సంవత్సరాల తరువాత నల్లజాతి వాళ్లు ఇంకా స్వేచ్ఛను పొందలేదు. వివక్షత అన్న గొలుసులతోనూ, వేరు చెయ్యటం అన్న సంకెళ్లతోనూ వంద సంవత్సరాల తరువాత కూడా నల్లజాతీయుల జీవితం కునారిల్లుతోంది...

నా నలుగురు చిన్న పిల్లలు ఒకనాడు వాళ్ల చర్మం రంగుబట్టి కాకుండా వాళ్ల వ్యక్తిత్వ లక్షణాలను బట్టి అంచనా వేసే దేశంలో ఉంటారని నాకొక కల ఉంది...డా॥ మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ డా॥ కింగ్

- డా॥ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ డా॥ కింగ్ ఇచ్చిన ఈ ప్రఖ్యాత ఉపన్యాసాన్ని చదివి, అమెరికా సమాజానికి అతడు ఉంచిన ఆదర్శాల గురించి, వాటిని సాధించటానికి అతడు రూపొందించుకున్న ప్రణాళిక గురించి ఒక వ్యాసం రాయండి.

ఈ ఉద్యమం బలపడుతున్న క్రమంలో అనేక దృష్టికోణాలు ముందుకొచ్చాయి. శాంతియుత మార్గాల ద్వారా ప్రజలందరికీ సమానత్వం సాధించటం వీలవుతుందని, అందుకు అవసరమైన చట్టాలు ప్రభుత్వం చేసేలా చెయ్యవచ్చని అనేకమంది డా॥ కింగ్‌తో ఏకీభవించారు. అయితే మాల్కం ఎక్స్ వంటి ఇతరులు అనేకమంది నల్ల వాళ్లు వేరే జాతి అని శ్వేత జాతీయుల పాలననుంచి స్వాతంత్ర్యం కోసం పోరాడాలని భావించారు. అధికారాన్ని చేజిక్కించుకోటానికి సాయుధ ఘర్షణలతో సహా అన్ని మార్గాలను వినియోగించుకోవాలని వాళ్లు భావించారు.

పౌరహక్కుల ఉద్యమంలో నల్లజాతి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అయితే ఈ ఉద్యమంలోనూ పురుషుల ఆధిపత్యం ఉందని, తమని ఎవరూ పట్టించుకోవటంలేదని వాళ్లు భావించసాగారు. ప్రఖ్యాత వాషింగ్టన్ ప్రదర్శనలో ఒక్క మహిళను కూడా మాట్లాడనివ్వలేదు. మహిళల సమానత్వం కోసం మహిళలు పోరాడాలని వాళ్లు భావించసాగారు.

ఈ విభిన్న ధోరణులన్నీ కలిసి ఆధునిక అమెరికా చరిత్రను మలిచిన బలమైన సమానత్వ ఉద్యమాన్ని నిర్మించటానికి దోహదం చేశాయి.

- పౌరహక్కుల ఉద్యమ కోరికల జాబితా తయారుచేసి, వాటికి మీరు సూచించే పరిష్కారాలు ఏమిటో రాయండి.
- ప్రజాస్వామిక దేశమని అమెరికా చెప్పుకుంటుంది, కానీ గత శతాబ్దం మధ్యకాలం వరకు కొంతమంది ప్రజలను వేరుగా ఉంచింది. భారతదేశ నేపథ్యంలో ప్రజాస్వామ్య భావన అందరినీ కలుపుకునేలా ఎలా ఉండాలో చర్చించండి.
- ఒక ఉద్యమంలో భిన్న గొంతుకలు ఎందుకు వినపడుతుంటాయి? వాటిల్లోని అభిప్రాయబేధాలను గుర్తించండి.

## యుఎస్ఎస్ఆర్‌లో మానవ హక్కుల ఉద్యమం

ఆ రోజుల్లో యుఎస్ఎస్ఆర్‌లోనూ, దాని ప్రభావంలో ఉన్న తూర్పు యూరపు దేశాలలోనూ స్వేచ్ఛపూరిత బహుళ పార్టీ ఎన్నికలను, సెన్సారులేని స్వేచ్ఛాపూరిత పత్రికలు, ప్రసార సాధనాలను, చివరికి సాధారణ ప్రజల స్వేచ్ఛాపూరిత భావ ప్రకటన, కదలికలు వంటి వాటిని అనుమతించలేదు. ఈ ప్రభుత్వాలు తమను కూలదోసే కుట్రల గురించి నిత్యమూ భయపడుతూ ఉండి ప్రజల అన్ని కార్యకలాపాలపై నియంత్రణ, నిఘా ఉంచేవి. ఇటువంటి నియంత్రణల వల్ల విసిగిపోయిన ప్రజలు భావప్రకటన, కదలికలకు స్వేచ్ఛ, స్వేచ్ఛాపూరిత పత్రికలు వంటి మానవ హక్కుల కోసం యుఎస్ఎస్ఆర్‌లోని పలు ప్రాంతాల్లోనూ, తూర్పు యూరపులోనూ పలు ఉద్యమాలు చేపట్టారు. హంగరీ, చెకస్లొవేకియా, పోలాండ్ వంటి దేశాలలో ఇవి తమ దేశాలపై యుఎస్ఎస్ఆర్ పెత్తనం నుంచి స్వేచ్ఛను కూడా కోరసాగాయి. ఈ ఉద్యమాలలో కొన్నింటికి అమెరికా, ఇంగ్లాండుతో సహా కమ్యూనిస్టు వ్యతిరేక దేశాల మద్దతు కూడా లభించింది. మానవ హక్కుల కోసం సాగిన ఈ ఉద్యమంలో అనేక రకాల ధోరణులు ఉన్నాయి. కొన్ని ధోరణులు సాధారణ ప్రజలకు మరింత స్వేచ్ఛను కోరగా, కొన్ని ఈ దేశాలలోని సోషలిస్టు వ్యవస్థకు అంతం పలకాలని ప్రయత్నించాయి. ప్రఖ్యాత రచయిత అలెగ్జాండర్ సోల్జ్ నిత్సిన్, అణు శాస్త్రవేత్త ఆంద్రే సఖరోవ్ ఈ రెండవ ధోరణికి ముఖ్య నాయకులు. ఇవి, ఇతర ఉద్యమాల ఫలితంగా యుఎస్ఎస్ఆర్‌లో అధ్యక్షుడు గోర్బచేవ్ కింద కొత్త నాయకత్వం ఆవిర్భవించింది. ఆయన ప్రజలకు మరింత స్వేచ్ఛను కల్పించటానికి గ్లాస్‌నోస్త్ అన్న సంస్కరణలు ప్రక్రియను ఆరంభించాడు.

- అమెరికా, యుఎస్ఎస్ఆర్‌లలోని రాజకీయ వ్యవస్థలో పోలికలు, తేడాలు గుర్తించండి. ప్రజల హక్కులకు అవి ఎలా స్పందించాయి?

## అణు వ్యతిరేక, యుద్ధవ్యతిరేక ఉద్యమాలు

1970లు, 1980లు ఒక కొత్త రకమైన ఉద్యమాన్ని చూశాయి. ఇది అణ్వాయుధాలు, యుద్ధాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం. 1945 ఆగస్టులో హిరోషిమా, నాగసాకిలపై వేసిన అణుబాంబుల దారుణాన్ని ప్రపంచమంతా చూసింది. అయినప్పటికీ అమెరికా, యుఎస్ఎస్ఆర్, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి అగ్ర రాజ్యాలు ఇతర దేశాలు వాటిని ఉపయోగించకుండా నిరోధిస్తుందన్న నమ్మకంతో అణ్వాయుధాల నిల్వలను పెంచుకుంటూ పోయాయి. అవి అమెరికా, యుఎస్ఎస్ఆర్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధమూ, వియత్నాంతో అమెరికా యుద్ధమూ తీవ్రంగా ఉన్న రోజులు. మరొక ప్రపంచ యుద్ధం

చెలరేగుతుందేమొనన్న భయం గుప్పిట్లో ప్రపంచమంతా ఉంది. యుద్ధం చెలరేగి, అణ్వాయుధాలను ఉపయోగించినట్లయితే భూమిమీద నుంచి మానవాళి అంతా తుడిచిపెట్టుకు పోతుందని భయపడసాగారు. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రజ్ఞులు, మేధావులు అణ్వాయుధాల నిరోధం కోసం ఉద్యమించసాగారు. వ్యర్థ ఆయుధ పోటీకి చరమగీతం పాడటానికి అమెరికా, యుఎస్ఎస్ఆర్‌లు ఒక ఒప్పందానికి రావాలని కోరసాగారు.

వియత్నాం యుద్ధంలో వియత్నాంకి చెందిన 8,00,000 సైనికులు, 30,00,000 పౌరులే కాకుండా అధిక సంఖ్యలో కంబోడియన్లు, లావోషియన్లు చనిపోయారు. అమెరికాకి ఎటువంటి పౌరనష్టం జరగలేదు కానీ చాలాపెద్ద సంఖ్యలో సైనికులు చనిపోయారు, అంతకంటే అధిక సంఖ్యలో వికలాంగులయ్యారు. తమ ప్రత్యర్థులైన అమెరికా, ఫ్రాన్స్‌లతో పోలిస్తే వియత్నాం విస్తృత అడవులతోనున్న పేద దేశం. యుద్ధంలో వియత్నామీయులు గెరిల్లా యుద్ధ పంథాని అనుసరించారు. అమెరికా రసాయనిక ఆయుధాలు, నాపాళం బాంబులు వంటి కొత్త ఆయుధాలను కనిపెట్టి గ్రామాలను సమూలంగా నాశనం చెయ్యటానికి వాటిని ఉపయోగించింది.

అమెరికాకు ఏమాత్రం ప్రమాదకరంకాని అమాయకమైన ప్రజలపై బాంబులు వెయ్యడం ఎంతవరకు న్యాయం అని 1970ల ఆరంభంలో వియత్నాం నుంచి తిరిగి వస్తున్న అమెరికా సైనికులలో సందేహం పెరగసాగింది. అదే సమయంలో ఎక్కడో ఉన్న వియత్నాంలో యుద్ధానికి తమ పిల్లలని పంపించటానికి ఇష్టపడని అమెరికన్ల సంఖ్య కూడా పెరుగుతూ వచ్చింది. దాంతో వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా అమెరికా అంతటా ప్రజా నిరసనలు ఉప్పొంగాయి. దీని వల్ల అంతిమంగా అమెరికా 1975లో యుద్ధాన్ని ఆపేసి వియత్నాం నుంచి బయటకు వచ్చేసింది. అమెరికాకు వ్యతిరేకంగా వియత్నాం

### "మేము వెళ్లం"

అమెరికాలో దృఢకాయులైన అందరూ తప్పనిసరిగా కొంతకాలం పాటు సైన్యంలో పని చెయ్యాలనే చట్టం ఉంది. వియత్నాంతో యుద్ధంలో పోరాడేందుకు సైన్యంలో చేరటానికి వేలాది పౌరులు నిరాకరించారు. ఈ తిరస్కరణ నిరశనలలో ఒకదానిని ఇక్కడ చదువుదాం. హార్వర్డ్ క్రింసన్ అన్న దిన పత్రికలో ఇది ప్రచురితమయ్యింది:

"సైన్యంలో చేరే వయసున్న యువకులమైన మమ్మల్ని ప్రభుత్వం వియత్నాంలో యుద్ధానికి పంపించవచ్చు. ఈ యుద్ధ చరిత్రని, స్వభావాన్ని మేం అధ్యయనం చేసిన మీదట ఈ యుద్ధంలో పాల్గొనటం మా అంతరాత్మలకు వ్యతిరేకంగా ఉంటుందన్న నిర్ణయానికి వచ్చాం. కాబట్టి వియత్నాంతో అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తున్నంత వరకు మేం సైనిక సేవలో చేరటానికి (చట్ట ప్రకారం అందరూ అలా చెయ్యాలి) నిరాకరించాలన్న స్థిర నిర్ణయాన్ని ప్రకటిస్తున్నాం. ఈ ప్రకటనపై సంతకం చేయటం ద్వారా ఇవే అభిప్రాయాలు ఉండి సైన్యంలో చేరే వయసున్న ఇతర యువకులతో సంఘీభావం తెలిపి యుద్ధానికి మా వ్యక్తిగత, నైతిక తిరస్కరణను బలమైన రాజకీయ వ్యతిరేకతగా మలచాలని అనుకుంటున్నాం."

- వీళ్లు దేశభక్తిలేని వాళ్లని కొంతమంది భావించగా, అన్యాయమైన యుద్ధంలో పాల్గొనాలనుకోకపోవటం సమర్థనీయమే అని మరికొంతమంది భావించారు. ఈ రెండు దృష్టి కోణాలను తరగతిలో చర్చించి మీ దృష్టికోణంతో పాటు రెండు వైపుల వాదనలను క్లుప్తంగా రాయండి.

ప్రజలు చేపట్టిన ఉద్యమం విజయం కావటం ప్రపంచ వ్యాప్తంగా శాంతి ఉద్యమాలకు స్ఫూర్తిని ఇచ్చింది.

వియత్నాం యుద్ధం ముగిసిన తరువాత మరిన్ని దేశాలు అణ్వాయుధాల నిల్వలలో ఒకదానితో ఒకటి పోటీ పడటంతో అణ్వాయుధ పోటీ తీవ్రరూపం దాల్చింది. ఈ ఆయుధాలను ఉత్పత్తిచేసే కంపెనీలు (వీటిని సైనిక–పారిశ్రామిక కంపెనీలంటారు), ప్రభుత్వాలు సాధారణ ప్రజలలో యుద్ధ భయాన్ని కలిగించి, అణ్వాయుధాల మీద డబ్బును మరింతగా ఖర్చు పెట్టటానికి మద్దతు పొందేవి. క్రమేపీ, ప్రత్యేకించి యూరపులో, అనేకమంది ప్రజలు యుద్ధ జపం, దాని ఫలితంగా ఆయుధ పోటీ వల్ల ప్రపంచమంతా ముప్పులో పడుతుందని, యుద్ధంలో ప్రత్యక్షంగా సంబంధంలేని దేశాలతో సహా ప్రపంచమంతా నాశనమయ్యే యుద్ధం సంభవించవచ్చని గుర్తించసాగారు. ప్రభుత్వ విధానాలపై పెద్ద ఎత్తున ప్రజా నిరసనలు చోటు చేసుకున్నాయి. ఇతర ప్రభుత్వాలతో అణ్వాయుధాల నిల్వలను తగ్గించుకోటానికి, శాంతి దిశగా కృషి చెయ్యటానికి చర్చలు ప్రారంభించ వలసిందిగా ఒత్తిడి చెయ్యసాగారు.

ఈ ఒత్తిడుల కారణంగా ఆయుధ పోటీలో ప్రధాన దేశాలైన అమెరికా, యుఎస్ఎస్ఆర్‌లు తమ అణ్వాయుధాలను తగ్గించు కోటానికి చర్చలు మొదలు పెట్టాయి. వీటిని వ్యూహాత్మక ఆయుధాల పరిమితి చర్చలు (స్ట్రాటెజిక్ ఆర్మ్స్ లిమిటేషన్ టాక్స్–ఎస్ఎఎల్‌టి) మొదలు పెట్టారు. అయితే ఇవి ఫలవంతం కాలేదు. అంతిమంగా 1991లో వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు ఒప్పందం (స్ట్రాటెజిక్ ఆర్మ్స్ రిడక్షన్ ట్రీటీ – ఎస్‌టిఎఆర్‌టి)మీద సంతకాలు చేశారు. చరిత్రలో అత్యంత పెద్ద, సంక్లిష్టమైన ఆయుధ నియంత్రణ ఒప్పందం ఇది. 2001లో ఇది అమలు అయినప్పుడు అప్పటికున్న అన్ని వ్యూహాత్మక అణ్వాయుధాలలో 80 శాతాన్ని తొలగించారు. ఒప్పందంపై సంతకం చేసిన కొంతకాలానికే యుఎస్ఎస్ఆర్ రద్దయ్యి దాని స్థానంలో కొత్తగా రష్యా దేశం ఏర్పడింది. దీంతో సుదీర్ఘకాల ప్రచ్ఛన్న యుద్ధానికి తెర పడింది. విధ్వంసకరమైన ప్రపంచ యుద్ధం




*చిత్రం 21.3 అ. వియత్నాం యుద్ధానికి వ్యతిరేక నిరసన,*
*ఆ. పెంటగాన్ వద్ద కాపలా ఉన్న సైనికుడికి నిరసనకారులలోని ఒక మహిళ ఒక పువ్వు ఇస్తోంది. ఈ బొమ్మలలోని భావనలను చర్చించండి.*

* ఆయుధీకరణకు వివిధ రకాల స్పందనలు ఏమిటి?
* పరస్పర విధానాలను ఆయా దేశాల ప్రభుత్వాలు నిర్ణయించటం మాత్రమే కాక వివిధ దేశాల ప్రజలు ఒకరినొకరు కలుస్తుంటే యుద్ధ అవకాశాలు తక్కువగా ఉంటాయి. దీంతో మీరు ఏకీభవిస్తారా? మీ సమాధానానికి కారణాలు పేర్కొనండి.
* అణు కర్మాగారాలను, కాలుష్య పరిశ్రమలను ఎక్కడ పెట్టాలన్న నిర్ణయాలతో సంబంధం లేని దేశాల ప్రజలు కూడా పర్యావరణ కాలుష్య ప్రభావానికి ఎలా గురవుతారో వివరించండి. ఇటువంటి పరిస్థితులను ఎలా పరిష్కరించాలి?

ఎప్పుడు సంభవిస్తుందో అన్న భయం తొలగిపోయింది. అయితే దేశాలమధ్య యుద్ధాలు, హింస అంతమైపోలేదని తూర్పు యూరపు, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ వంటి ప్రాంతాల్లో విధ్వంసకర యుద్ధాలు తెలియచేశాయి.

యుఎస్ఎస్ఆర్ చివరి దశలో చెర్నోబిల్‌లో ఉన్న అణుకర్మాగారంలో పెద్ద ప్రమాదం జరిగింది. దీనివల్ల చెర్నోబిల్‌లో కార్మికులు పెద్ద సంఖ్యలో చనిపోయారు. అంతేకాదు యూరపులోని అనేక దేశాలతో సహా చాలా విశాల ప్రాంతంలో అణు కాలుష్యానికి కారణమైంది. దీని ప్రభావం వల్ల యుద్ధం కోసమైతేనేమి, శాంతియుత ప్రయోజనాల కోసమైతేనేమి అణుశక్తిని ఉపయోగించటంలోని ప్రమాదాలు ప్రజలకు తెలిశాయి. ఫలితంగా యుద్ధ వ్యతిరేక ఆందోళనలు, పర్యావరణ పరిరక్షణ ఆందోళనలు చెలరేగాయి.

## ప్రపంచీకరణ, నిర్వాసితులైన ప్రజలు, పర్యావరణ ఉద్యమాలు

1990ల నుంచి 'ప్రపంచీకరణ', 'నయా ఉదారవాదం' అన్న పేర్లతో సంభవిస్తున్న ప్రపంచవ్యాప్త ఆర్థిక, రాజకీయ మార్పుల వల్ల ఎటువంటి సదుపాయాలు లేని ప్రజల జీవితాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. గిరిజన ప్రజలు, పేదరైతులు, భూమిలేని కార్మికులు, మహిళలు, అవ్యవస్థీకృత రంగంలో పనిచేస్తున్న పట్టణ పేదలు, పారిశ్రామిక కార్మికులు అందరికంటే తీవ్రంగా ప్రభావితమయ్యారు. ఇటువంటి ప్రజలలో ఎక్కువ మందికి పాఠశాల చదువు, సరైన పోషకాహారం, వైద్యం అందుబాటులో లేవు. ఈ కారణంగా కొత్త ఉద్యోగాలు కానీ, మంచి జీతాలు గల ఉద్యోగాలు కానీ, చట్టబద్ధ లేక రాజ్యాంగ బద్ధ పరిహారాలు కానీ వీళ్లకి అందుబాటులో లేవు.

గత కొద్ది దశాబ్దాలలో వాణిజ్య రైతులు, గనులతవ్వకం సంస్థలు, ఆనకట్టల పథకాల వంటి వాటినుంచి గిరిజనులు, నిర్వాసితులైన ప్రజలు ముప్పును ఎదుర్కొంటున్నారు. ఖనిజాలు, అరుదైన మొక్కలు, ప్రాణులు, నీళ్లు వంటి విలువైన వనరులను పెద్ద పెద్ద కంపెనీలు గ్రామీణ ప్రాంతాల్లో కనుక్కోవటంతో తరతరాలుగా ఉంటున్న ప్రాంతాల నుంచి గిరిజనులు, రైతులు తొలగింపబడుతున్నారు. దీంతో ప్రజలు కొత్త ప్రాంతాలలో చెల్లాచెదురై పోతున్నారు, గిరిజన సంస్కృతి విధ్వంసమవుతోంది. ఫలితంగా వాళ్లు సమాజంలో అత్యంత ప్రభావిత ప్రజానీకంగా మారిపోయారు. అంతేకాకుండా ఈ అభివృద్ధి ప్రక్రియల వల్ల ప్రకృతి వనరులకు తీవ్ర ముప్పు ఏర్పడటంతో పర్యావరణ ఉద్యమాలు చేపట్టారు. ఈ అభివృద్ధి శక్తుల విధ్వంసకర, హింసాత్మక స్వరూపంపై కోపాన్ని, నిర్వాసితులైన ప్రజల గొంతులను కలపటానికి ఈ ఉద్యమాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ ఉద్యమాలు భిన్నమైన భవిష్యత్తు లక్ష్యాన్ని కోరుకుంటున్నాయి.

## యూరపులో గ్రీన్‌పీస్ ఉద్యమం

అలాస్కా దగ్గర సముద్ర గర్భంలో అమెరికా 1971లో చేపట్టిన అణు పరీక్షలకు వ్యతిరేకంగా ఈ ఉద్యమం మొదలయ్యింది. నిరసన తెలియచెయ్యటానికి స్వచ్ఛంద కార్యకర్తలు చిన్న పడవలో ప్రయోగ ప్రదేశానికి బయలుదేరారు. ఈ పడవ పేరు 'గ్రీన్‌పీస్', చివరికి ఇది ఆ ఉద్యమం పేరుగా మారింది. ప్రస్తుతం ఈ ఉద్యమం నలభై దేశాలలో విస్తరించి ఉంది. దీని ప్రధాన కార్యాలయం ఆమ్‌స్టర్‌డాం (హాలండ్)లో ఉంది. ఇది ముఖ్యమైన అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలలో ఒకటి.

సూర్యుని హానికర కిరణాలను అడ్డుకునే వాతావరణంలోని ఓజోను పొర కాలుష్యం వల్ల దెబ్బ తింటోందని గత కొద్ది దశాబ్దాలలో శాస్త్రజ్ఞులు గుర్తించారు. కాలుష్యం వల్ల భూమి సగటు ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. దీని కారణంగా ధ్రువ ప్రాంతాల వద్ద ఉండే మంచు టోపీలు (పెద్ద మొత్తంలో గడ్డకట్టిన నీళ్లు) కరుగుతున్నాయి. ఈ మంచు కరిగి సముద్రాలలో చేరటం వల్ల మహా సముద్రాలు, సముద్రాల నీటిమట్టం పెరిగి ప్రపంచమంతటా తీరప్రాంతాలు ముంపునకు గురవుతాయి. సముద్ర తీరం వెంట బంగ్లాదేశ్, శ్రీలంక, మారిషస్, భారతదేశం, ఇండోనేసియా వంటి దేశాలలో అధిక సంఖ్యలో ఉంటున్న ప్రజలు వరదలు, ముంపు వంటి తీవ్ర సమస్యలతో ప్రభావితమౌతారు. ప్రపంచం వేడెక్కటం వల్ల, వర్షపాతంలో తేడాల వల్ల (అకాల వర్షాలు, అధిక వర్షాలు, కరువులు), పంటలు నష్టపోవటం వల్ల తీర ప్రాంతానికి దూరంగా ఉన్న ప్రజలు కూడా ప్రభావితమౌతారు. ఇంకో మాటల్లో చెప్పాలంటే ప్రపంచవ్యాప్త వాతావరణ మార్పు వల్ల వ్యవసాయాధారిత ప్రజలు, దేశాలు ప్రధానంగా ప్రభావితమౌతాయి.

వాతావరణ మార్పుపై పలు దేశాలలో గ్రీన్‌పీస్ ఉద్యమం చేపట్టింది. "అనంత వైవిధ్యతతో కూడిన జీవాన్ని భూమి పోషించే శక్తిని కాపాడటం" దాని ఉద్దేశం. కాలక్రమంలో ఈ ఉద్యమం 'సుస్థిర అభివృద్ధి' అన్న భావనను ముందుకు తెచ్చింది. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందని దేశాల ప్రజలందరికీ న్యాయంగా ఉండే, పర్యావరణ రీత్యా దీర్ఘకాలం మనగలిగే అభివృద్ధిని అది కోరుకుంటోంది.

- గ్రీన్‌పీస్ ఉద్యమం వెబ్‌సైట్ చూసి (http://www.greenpeace.org/intrnational) అది పని చేస్తున్న అంశాల గురించి, ఎంచుకున్న పోరాట పద్ధతుల గురించి తెలుసుకోండి. ఈ ఉద్యమంపై ఉన్న చర్చలు, విమర్శల గురించి కూడా తెలుసుకోండి.

## భోపాల్ గ్యాస్ దుర్ఘటన, సంబంధిత ఉద్యమాలు

1984లో భోపాల్‌లో సంభవించిన ఈ తీవ్ర దుర్ఘటన గురించి మీరు చదివి ఉంటారు. భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కంపెనీ (తరువాత దీనిని డౌ కంపెనీకి అమ్మేశారు)నుంచి ఒక రాత్రి విషవాయువు వెలువడింది. దీని వల్ల వేలాది మంది చనిపోయారు, దాని ప్రభావం వల్ల ఇప్పటికీ వేలాదిమంది బాధపడుతున్నారు. ప్రపంచంలోనే ఇది అతి పెద్ద పారిశ్రామిక దుర్ఘటన. మొదటినుంచి భోపాల్ ప్రజలు నాలుగు ముఖ్యమైన కోరికల కోసం పోరాడుతున్నారు:

ప్రభావితులైన వాళ్లకి సరైన వైద్య సౌకర్యం; ఆ కంపెనీ బహుళ జాతి కంపెనీ కాబట్టి అంతర్జాతీయ ప్రామాణికాల ఆధారంగా నష్ట పరిహారం; బహుళజాతి కంపెనీ యాజమాన్యాన్ని ఈ నేరానికి బాధ్యులుగా చెయ్యటం; చివరిగా భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా చూడటం.




*చిత్రం 21.4 : భోపాల్ గ్యాస్ దుర్ఘటన సంస్మరణ*


వీటిల్లో కొంతవరకు విజయం సాధించినప్పటికీ అన్ని ప్రధాన కోరికలు తీరటానికి ఇంకా ఎంతో దూరంలోనే ఉన్నారని చెప్పాలి. భోపాల్‌లో వైద్య సదుపాయాలు కల్పించటానికి పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసినప్పటికీ దుర్ఘటనకు ప్రభావితమైన వ్యక్తులు ఇంకా అనారోగ్యంతో బాధపడుతూనే ఉన్నారు. నష్టపరిహారం అంతర్జాతీయ ప్రామాణికాల ప్రకారం అందించలేదు, అందించిన కొద్ది మొత్తం కూడా ప్రభావితమైన ప్రజలందరికీ సరిగా పంపిణీ చెయ్యలేదు. ప్రమాదానికి కారణమైన కంపెనీ యాజమాన్యాన్ని ప్రభుత్వం విచారించి, శిక్షించనే లేదు. ప్రస్తుతం మెరుగైన చట్టాలు ఉన్నమాట నిజమే కాని, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూడటానికి సరైన విధానాలుకానీ, తగినంత, నిష్పక్షపాత తనిఖీ వ్యవస్థకానీ లేవు. దుర్ఘటనకి కారణమైన కంపెనీ అమెరికాలో ఉండటంతో ఈ విషయంలో నిరసనలు తెలియచెయ్యటం మరింత కష్టమయ్యింది. ఈ కంపెనీ కారణంగా ఏర్పడిన కాలుష్యం వల్ల ప్రభావితమైన ఫ్యాక్టరీ కార్మికులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చెయ్యటానికి అంతర్జాతీయ చట్టాలను ఉపయోగించుకోవలసి వస్తోంది. లండన్‌లో జరుగుతున్న ఒలంపిక్స్ క్రీడలకు డౌ కంపెనీ స్పోన్సరు చెయ్యటానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు సంతకాలు చేస్తున్నారు. ఈ విధంగా ఈనాటికి ఈ విషయంమీద ప్రజలను సమీకరిస్తున్నారు. ఒలంపిక్ సంఘం, డౌ కంపెనీకి మధ్య అనైతిక సంబంధాన్ని ప్రపంచ వ్యాప్తంగా అనేక సంస్థలు ఎత్తి చూపుతున్నాయి.

## పర్యావరణ ఉద్యమాలు

మన దేశంలో కూడా పర్యావరణ ఉద్యమాలు అడవుల రక్షణకోసం గ్రామ స్థాయిలో జరిగిన ఉద్యమాలతో 1970లలోనే ఆరంభమయ్యాయి. మీరు 12వ అధ్యాయంలో చదివిన చిప్కో ఆందోళన ఇటువంటి ఉద్యమాల్లో ఒకటి.

## నర్మదా నదిపై ఆనకట్టలకు వ్యతిరేకంగా ఉద్యమాలు

1950లలో భారతదేశ ప్రణాళికాబద్ధ అభివృద్ధిలో 'బహుళార్థకసాధక' పెద్ద ఆనకట్టలను కట్టటం ఒక భాగం. ఇలా కట్టిన ఆనకట్టలలో కొన్ని భాక్రానంగల్, హీరాకుడ్, నాగార్జునసాగర్. మొదట్లో ప్రజలు ఆనకట్టలను అద్భుతమైన నిర్మాణాలుగా పరిగణించారు: అవి పెద్ద మొత్తంలో నీళ్లను నిల్వచేసి, విశాల భూ భాగాలకు సాగునీరు అందించి, పెద్ద మొత్తంలో విద్యుత్తును ఉత్పత్తి చేసి, వరదలు, కరువులను



నియంత్రిస్తాయని ఆశించారు. వీటి పట్ల ఆరాధనాభావం ఎంతగా ఉండేదంటే ఈ ఆనకట్టల వల్ల ముంపునకు గురైన ప్రాంతాలలోని ప్రజలకు, చెట్లకు, పొలాలకు, జంతువులకు ఏమయ్యిందని ఎవరూ అడగలేదు. ఈ ఆనకట్టల నిర్మాణంలో కోల్పోయిన విశాలమైన సారవంత భూ భాగాల గురించి, నష్టపోయిన చెట్లు, జంతుజాలం గురించి, నిర్వాసితులైన ప్రజల గురించి ఎవరూ పట్టించుకోలేదు. నిర్వాసితులైన ప్రజలు వెళ్లటానికి ఎక్కడా చోటు లేదు, వాళ్లకి ఎటువంటి నష్టపరిహారమూ ఇవ్వలేదు, ఒకవేళ ఇచ్చినా అది నామమాత్రంగానే ఉంది. పెద్ద ఆనకట్టల వల్ల దేశ ప్రజలకు ఒనగూడే విస్తృత ప్రయోజనాల ముందు ఈ సమస్యలు చిన్నవని చాలామంది భావించారు. అయితే నష్టపోయిన అడవులు, భూములు, గ్రామాల వంటి ఖర్చులు, నష్టాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే ఆనకట్టల మీద పెట్టిన ఖర్చుకి అవి తగినంతగా ఫలితాలను ఇవ్వటం లేదని గ్రహించిన ప్రజలు వీటిని ప్రశ్నించసాగారు. ఆనకట్టలకు చాలా పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుంది. నిర్మాణంలో ఆలస్యం వల్ల, ధరల పెరుగుదల వల్ల ఈ ఖర్చు ఇంకా విపరీతంగా పెరిగిపోతుంది. అంతేకాకుండా ఇవి ముందుగా ఆశించినంత విస్తీర్ణానికి సాగునీటిని అందించవు, అనుకున్నంత విద్యుత్తును ఉత్పత్తి చేయవు. ఆనకట్టలో నిల్వ చెయ్యగలిగిన నీటి మొత్తం ఇంజినీర్లు అంచనా వేసిన దానికంటే తక్కువగా ఉండటంవల్ల ఇలా జరుగుతోంది. భారతదేశ చరిత్రలోనే నర్మదా నదిపై అత్యంత పెద్దదైన నదీ లోయ పథకాల నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వం ప్రతిపాదించటంతో ఈ సమస్యలన్నీ ముందుకొచ్చాయి.

ఈ పథకం వల్ల నిర్వాసితులయ్యేప్రజలు కేవలం భూములున్న వాళ్లకే కాకుండా, అక్కడ ఉంటున్న వాళ్లందరికీ న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని కోరసాగారు. అంతేకాకుండా ఆనకట్ట వల్ల ముంపునకు గురైన అడవులకు బదులుగా అటవీ పెంపకాన్ని చేపట్టాలని, భూమి కోల్పోయిన వాళ్లకి బదులుగా భూమి ఇవ్వాలని, సరైన పునరావాసం కల్పించాలని కోరసాగారు. అయితే, త్వరలోనే ప్రజలు రెండు విషయాలు గుర్తించారు: కోల్పోయిన భూమికి నష్టపరిహారంగా ఇవ్వటానికి తగినంత భూమిలేదు, నిర్వాసితులైన ప్రజలందరికీ సరైన పునరావాసం కల్పించటం సాధ్యం కాదు. అంతేకాకుండా ఇది నష్టపరిహారం, పునరావాసానికి సంబంధించిన సమస్య కాక అభివృద్ధికి సంబంధించిన లోపభూయిష్ట దృక్పథమని ప్రజలు గుర్తించసాగారు. ఈ రకమైన అభివృద్ధి వ్యవసాయాన్నీ, గిరిజన ప్రజలను ప్రణంగా పెట్టి పరిశ్రమలు, వాణిజ్య వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చెయ్యటం, సహజ వనరులను సుస్థిరంకాని పద్ధతులలో వినియోగించటంపైన ఆధారపడి ఉంది. ఇది పేద రైతులు, గిరిజనుల జీవన ప్రమాణాన్ని ఏ రకంగానూ మెరుగుపరచకుండా వాళ్లని నైపుణ్యంలేని కూలీలుగా మారుస్తుంది.



*చిత్రం 21.5 : నిర్వాసితులు కావటానికి వ్యతిరేకంగా నర్మదాలోయలో నిరసన ప్రదర్శన*

ఈ ఉద్యమ నాయకులు ఈ ఆనకట్టల నిర్మాణాన్నే వ్యతిరేకించ సాగారు. 12వ అధ్యాయంలో మీరు బావా మహలియా గురించి చదివారు. నర్మదాలోయ ఆనకట్టకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రజా ఉద్యమమైన నర్మదా బచావో ఆందోళన్‌లో అతడు కూడా భాగస్వామి.

మొదట ప్రపంచబ్యాంకు నుంచి తీసుకున్న అప్పుతో సర్దార్ సరోవర్ ఆనకట్టను నిర్మించాలని అనుకున్నారు. తీవ్ర నిరసనలు, ప్రజల సమీకరణ, ప్రదర్శనలు, నిరాహార దీక్షలు,అంతర్జాతీయ ఉద్యమాల తరువాత ప్రపంచ బ్యాంకు దీనికి నిధులు సమకూర్చగూడదని నిర్ణయించుకుంది.

● రైతులను, గిరిజనులను నిర్వాసితులను చెయ్యకుండా కర్మాగారాలు కట్టడం, గనుల తవ్వకం, విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను చేపట్టటం సాధ్యంకాదా? ఎటువంటి ప్రత్యామ్నాయాలు ఉన్నాయి? ఈ అంశాలపై మీ ఇంటిలోనూ, తరగతిలోనూ చర్చించండి.

## భారత పర్యావరణ పరిస్థితి

1980లో విజ్ఞానశాస్త్రం, పర్యావరణ కేంద్రం (సెంటర్ ఫర్ సైన్స్ & ఎన్విరాన్‌మెంట్) అన్నదానిని అనిల్ అగర్వాల్ స్థాపించాడు. భారతదేశంలోని అభివృద్ధి, పర్యావరణ అంశాలపై అధ్యయనం చేసి వాటి పట్ల అవగాహన కలిగేలా చెయ్యటం దీని ఉద్దేశం. 'భారతదేశ పర్యావరణ స్థితిపై పౌరుల నివేదికలు 1982' అన్న ప్రఖ్యాత ప్రచురణతో అది మొదలుపెట్టింది. ఈనాడు దేశం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలకు సమగ్రమైన సూచికల కోసం ఈ నివేదికలు ఉపయోగపడుతున్నాయి. అది చేస్తున్న పని, అధ్యయనం చేసిన సమస్యల గురించి మరింత తెలుసుకోటానికి దాని వెబ్‌సైట్‌ను చూడండి: http://www.cseindia.org

సర్దార్ సరోవర్ ఆనకట్ట నిర్మాణాన్ని ఆపటంలో నర్మదా బచావో ఆందోళన్ విఫలమైనప్పటికీ అందరూ అభివృద్ధి స్వభావం గురించి ఆలోచించేలా చెయ్యటంలో అది విజయం సాధించింది – అది పేదవాళ్ల ప్రయోజనాల కోసమా, లేక ధనికులు, శక్తిమంతులకోసమా అని ఆలోచింపచేసింది. ప్రకృతిలో పెద్ద ఎత్తున జోక్యం చేసుకుంటూ కట్టే పెద్ద పెద్ద కట్టడాల ప్రయోజనాల గురించి కూడా అందరూ ఆలోచించేలా అది చేసింది. ఇటువంటి 'అభివృద్ధి కారణంగా నిర్వాసితులైన' ప్రజలకు తగినంత, గౌరవప్రదమైన నష్టపరిహారం చెల్లించే దిశలో ప్రభుత్వం ఆలోచించేలా చేసింది.

'నర్మదా బచావో' ఉద్యమంలో అనేక ధోరణులు కలగలిసి ఉన్నాయి. ఇవి: మూలవాసీ ప్రజల ఉద్యమం, నయా–ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం, పట్టణీకరణకు ఆనకట్టలు, పరిశ్రమలు, గనులు వంటి వాటి కోసం భూములు లాక్కోబడుతున్న నేపథ్యంలో తమ భూములను కాపాడుకోటానికి రైతులు చేస్తున్న ఉద్యమాలు వంటివి.

## సైలెంట్ వ్యాలీ ఉద్యమం (1973–83)

కేరళలోని పశ్చిమ కనుమలలోని సైలెంట్ వ్యాలీ (నిశ్శబ్ద లోయ)లో ప్రవహిస్తున్న రెండు నదులపై ఆనకట్టలు నిర్మించాలని ప్రతిపాదించినప్పుడు, వీటివల్ల ఆ లోయలో ఉన్న అరుదైన జంతువులు, మొక్కలు అంతరించిపోతాయని విద్యావంతులైన అనేక మంది గ్రహించారు. ఈ అరుదైన జాతులలో ఒక రకమైన కోతి అయిన సింహపు తోక కోతి (లయన్ టేల్డ్ మకాక్) ఒకటి. క్రమేపీ సైలెంట్ వ్యాలీకి మద్దతుగా, ఆనకట్టలకు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం ఏర్పడింది. ప్రజలలో విజ్ఞాన శాస్త్ర ప్రచారానికీ, విద్యకోసం పని చేస్తున్న కేరళ శాస్త్ర సాహిత్య పరిషత్ (కెఎస్‌ఎస్‌పి) రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను సమీకరించింది. ప్రాజెక్టు ప్రాంతంలో చెట్లను నరకటానికి వ్యతిరేకంగా ఆ సంస్థ కోర్టుకి వెళ్లింది. దాంతో కేరళ హైకోర్టు చెట్లు నరకటాన్ని ఆపేసింది. తీవ్ర నిరసనల నేపథ్యంలో చివరికి ప్రభుత్వం ఆనకట్టల నిర్మాణాన్ని విరమించుకుని సైలెంట్ వ్యాలీని 1985లో జాతీయ పార్కుగా ప్రకటించింది.



*చిత్రం 21.6 : ఇక్కడ అడవిలో కీచురాళ్లు లేవు, అందుకే ఈ అడవి 'నిశ్శబ్దం'గా ఉంటుంది. సింహపు తోక కోతి ఇంకా అనేక ఇతర పురుగులు, పక్షులు ఈ లోయకి ప్రత్యేకమైనవి.*

## మేధా పాట్కర్‌తో ముఖాముఖి

నర్మదా బచావో ఆందోళన నాయకులైన మేధా పాట్కర్ ఒక ఇంటర్వ్యూలో ఆ సంస్థ గురించి ఇలా చెప్పారు:

*గుజరాత్ ప్రభుత్వం తను అనుకున్నదే చేస్తున్నందున ఇప్పుడు కూడా ఉద్యమాన్ని కొనసాగించటంలో ఏమైనా అర్థం ఉందా?*

"లక్ష్యాలను చేరుకునేదాకా పోరాటం ముగియదు...

ప్రభుత్వం ప్రకటించిన విధానమూ, ప్రణాళిక ప్రగతిశీలమైనదని, వ్యవసాయ అనుకూలమైనదని ఎంతగా బాకాలు ఊదినా జీవనోపాధులు కోల్పోయిన వారికి భూమిని ఇవ్వలేకపోయిందన్నది అందరికీ విశదమవుతోంది. పర్యావరణ అంశాలను ఇంకా అమలు చెయ్యలేదు. ఆమోదాల్లో విధించిన షరతులు, విధానాల్లో చేసిన వాగ్దానాలు పూర్తిచెయ్యకుండా ఆనకట్ట ఎత్తు పెంచటమన్నది అన్యాయం.



*చిత్రం 21.7*

ప్రకృతి ఆధారిత ప్రజల ఆవాసాలను ముంపునకు గురిచేసి, తీవ్ర సామాజిక, పర్యావరణ, ఆర్థిక ఖర్చుతో సాధించిన అభివృద్ధి కొంచెం కూడా కచ్ ప్రాంతంలో నిజంగా అవసరమైన ప్రజలకి కాకుండా గుజరాత్‌లోని పెద్ద పట్టణాలకు, కార్పొరేట్ సంస్థలకు వెళుతోందని ప్రపంచానికి తెలియచెయ్యటానికి కూడా ఉద్యమం కొనసాగవలసిన అవసరం ఉంది. ఇటువంటి అభివృద్ధి విధానం మారాలని నర్మదా బచావో ఆందోళన్ పోరాడుతోంది. విధ్వంసం, అసమానతలు, నిర్వాసితులు కావటానికి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమం నర్మదాలోయలోనే కాకుండా, దేశమంతా జరుగుతున్న ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాతో, పునః నిర్మాణ పనితోనూ కొనసాగాల్సిన అవసరం ఉంది...."

- సామాజిక ఉద్యమాలు ఉపయోగించిన వివిధ వ్యూహాలను పేర్కొనండి.
- పునరావాసాన్ని కల్పిస్తామన్న వాగ్దానాలను ఉద్యమంలోని ప్రజలు ఎలా పరిగణిస్తున్నారు?

## సామాజిక న్యాయం, మానవ హక్కుల కోసం మహిళల ఉద్యమం

మహిళలు ఎదుర్కొంటున్న అసమానతల గురించి, సమాన హక్కులు, అవకాశాలు, వ్యక్తిగత భద్రత, న్యాయంకోసం వాళ్లు చేస్తున్న పోరాటాల గురించి ఇంతకు ముందు తరగతుల్లో చదివాం. ఇటీవల కాలంలోని అనేక ముఖ్యమైన సామాజిక ఉద్యమాల్లో సైతం మహిళలు ముందున్నారు. ఇక్కడ మనం రెండు ఉదాహరణలతో దీనిని మరింత బాగా అర్థం చేసుకుందాం: ఆంధ్రప్రదేశ్‌లో సారాకి వ్యతిరేకంగా మహిళల ఉద్యమం, ఈశాన్య ప్రజలపై దమననీతికి కారణమైన సైనిక బలాల ప్రత్యేక అధికారాలకు వ్యతిరేకంగా మణిపురి మహిళల ఉద్యమం.

### ఆడవాళ్లు ఏకమైతే

*"ఇది కథ కాదు. ఇది రాత్రి బడిలో చదువు నేర్చుకున్న మహిళల విజయగాథ. మా ఊరు దూబగుంట. మేం కూలిపని చేసుకుని బతుకుతాం. మేం మట్టినుంచి బంగారం పండిస్తాం. కానీ మేం*

*కష్టపడి సంపాదించిన సొమ్మంతా మగవాళ్లు కల్లు, సారాయి మీద ఖర్చు చేసేస్తారు. వాళ్ల దగ్గర డబ్బులు లేకపోతే బియ్యం, నెయ్యి, అమ్మి సారా కొనుక్కుంటారు. దానికోసం ఏవస్తువులనైనా అమ్మేస్తారు. వాళ్ల చేతికి దొరికిన ప్రతి వస్తువూ పట్టుకెళతారు... తాగింది కాకుండా మమ్మల్ని తిడతారు, మాతో గొడవలు పెట్టుకుంటారు, పిల్లల్ని కొడతారు. మా రోజువారీ జీవితాన్ని దుర్భరంగా చేస్తారు. మా దగ్గర ఉన్న పాఠ్యపుస్తకంలో 'సీతమ్మకథ' చదివాం. అది మమ్మల్ని ఆలోచింప చేసింది. ఆమె చావుకి ఎవరు కారణం? సారా అంగడి మూసెయ్యాలని సర్పంచ్‌కి చెప్పాం. అయితే అందులో మేం సఫలం కాలేదు.*

*"దాంతో మరునాడు వందలాది మందిమి కదిలి ఊళ్లోకి వస్తున్న సారాబండిని ఊరిబయటే ఆపేశాం. సారా పారబొయ్యమని బండి యజమానికి చెప్పాం. అతడికి జరిగిన నష్టానికి ఒక్కొక్కరం ఒక్కొక్క రూపాయి ఇస్తామని చెప్పాం. అతడు భయపడిపోయాడు. ఆ రోజునుంచి మా ఊళ్లోకి సారాబండి రాలేదు. ఒకరోజు సారాతో ఒక జీపు ఊళ్లోకి వచ్చింది. మేం దానిని చుట్టుముట్టి మెజిస్ట్రేటుకి ఫిర్యాదు చేస్తామని యజమానిని హెచ్చరించాం. అతడు వణికిపోయాడు. ఊళ్లో దుకాణాన్ని మూసేశాడు. దాంతో మా ఆత్మవిశ్వాసం పెరిగింది. విద్యవల్లనే ఈ విజయం సాధ్యమయ్యిందని మేం గుర్తించాం. ఈ సంవత్సరం సారా వేలం పాటలో పాల్గొనే సాహసం ఎవరూ చెయ్యలేకపోయారు."*

ఇది 1992లో జరిగింది. అయితే ఇది ఏకైక సంఘటన కాదు. ఈ వార్త వ్యాపించటంతో ఇతర గ్రామాల మహిళలు కూడా తమ గ్రామాల్లో సారా అమ్మకాలను నిలిపివేశారు. అంతిమంగా వాళ్లు వేలాది సంఖ్యలో నెల్లూరు కలెక్టరు కార్యాలయం వద్దకు కదం తొక్కి సంవత్సరానికి ఒకసారి జరిగే సారా కాంట్రాక్టు వేలం పాటలను ఆపేశారు. వేలంపాటను కలెక్టరు ఆరుసార్లు వాయిదా వేసి, చివరికి వాటిని రద్దు చెయ్యవలసి వచ్చింది.

ఇతర ప్రాంతాల్లో మహిళలు సారా అంగళ్లకు వ్యతిరేకంగా నిరసనలు నిర్వహించారు, వాటిని పికెటింగ్ చేశారు, ఆ అంగళ్లను మూసెయ్యటానికి ప్రయత్నించారు. దుకాణాల్లో సారా పెట్టుకోనివ్వకుండా చేసి, లేదా మగవాళ్లు సారా కొనకుండా చేసి సారా అమ్మకాలను ఆపటానికి వాళ్లు ప్రయత్నించారు. దుకాణాలు మూసెయ్యటానికి యజమానులు నిరాకరిస్తే వాటిని పికెటింగ్ చేసేవాళ్లు, సారా ప్యాకెట్లు బయట పారేసేవాళ్లు, సారా తగలబెట్టేవాళ్లు. అనేక ఊళ్లలో సారా అలవాటు మానని మగవాళ్ల మీసాలను ఆడవాళ్లు కత్తిరించారు, కొన్ని సందర్భాలలో గాడిదమీద కూర్చోబెట్టి ఊరేగించారు. ఇక సారా ముట్టబోమని మగవాళ్లతో ఆలయాలలో ఒట్టు వేయించేవాళ్లు. రాష్ట్రమంతటా మహిళలు చేపట్టిన నిరసనలు, సమావేశాల ఫలితంగా చివరికి 1993 అక్టోబరులో సారాని అధికారికంగా నిషేధించారు, 1995లో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని విధించారు.

ఈ మహిళలు దళితులు, అత్యంత పేదలు. తమ భర్తలు, మగవాళ్లు సారాయికి బానిసలు కావటంతో తీవ్ర కష్టాలకు లోను కాసాగారు. ఈ మహిళల్లో చాలామంది అక్షరాస్యత తరగతులకు హాజరు కాసాగారు. వీళ్లు తరచు తమ సమస్యల గురించి మాట్లాడుకుంటూ ఉండేవాళ్లు. ఈ రాత్రిపూట తరగతుల వల్ల ఈ మహిళలకు తమ జీవితాల గురించి మాట్లాడుకునే అవకాశం లభించింది, కొత్త సంబంధాలను ఏర్పరిచింది. ఒకసారి ఉద్యమం మొదలైన తరువాత వీటి అనుభవాలు సాక్షరతా పుస్తకాల ద్వారా రాష్ట్రంలోని మహిళలందరికీ విస్తరించాయి. ఆ విధంగా సమాజంలో అత్యంత పేదలైన వర్గానికి చెందిన మహిళలు ధనబలం, కండబలంతో పాటు రాజకీయ అండదండలున్న సారాయి తయారీదారులు, అమ్మకందారులను ఎదుర్కోగలిగారు.

ఈ రోజు పరిస్థితి మళ్లీ మారిపోయింది, సారాయి అంగళ్లు మళ్లీ నడుస్తున్నాయి. ఇటువంటి ఉద్యమాల విజయాలు చిరకాలం కొనసాగాలంటే నిరంతర నిఘా, కార్యాచరణ ఉండాలన్నది అర్థమవుతుంది.

- ఇటీవల కాలంలో పశ్చిమ బెంగాల్ (నందిగ్రాం), ఒడిశా (నియమగిరి), ఆంధ్రప్రదేశ్ (పోలవరం, సోంపేట, మొదలైనవి)లో జరిగిన ఇటువంటి పోరాటాల గురించి మరింత తెలుసుకోండి. ఈ పోరాటాల్లో ముఖ్యమైన అంశాలను వివరిస్తూ ఒక పోస్టరు తయారు చెయ్యండి.

## మానవ హక్కులపై సామాజిక సమీకరణ

తమ చర్యలపై చట్టబద్ధ సమీక్ష లేకుంటే అంటే సైనిక దళాల చర్యలను కోర్టుల్లో సవాలు చెయ్యలేం. ప్రజలను అణిచివెయ్యటానికి సాయుధ దళాలకు అధికారాలు ఇచ్చే చట్టాలకు వ్యతిరేకంగా ఈశాన్య భారతంలోని మణిపురి మహిళలు ఎట్లా పోరాడారో తెలుసుకుందాం.

మానవ హక్కులలోని కొన్ని అధికరణాలు కింద ఉన్నాయి. ఈ భాగాన్ని రెండుసార్లు చదవండి. మొదటిసారి అంతా చదివి మానవులందరికీ ఉండాల్సిన మానవ హక్కులను గుర్తించండి. తరువాత కింద ఇచ్చిన మానవ హక్కుల ఉల్లంఘన గురించి ఏ పేరా, ఏ వాక్యంలో ఉందో గుర్తించండి. (ప్రతిదానికి దొరకక పోవచ్చు, దానిని ఖాళీగా ఉంచెయ్యండి.)

**అధికరణం 3:** ప్రతి ఒక్కరికీ జీవితం, స్వేచ్ఛ, వ్యక్తిగత భద్రతలకు హక్కు ఉంది. పేరా --------- వాక్యం ---------

**అధికరణం 5:** ఎవరిని హింసకు లేదా క్రూర, అమానవీయ, అవమానకర వ్యవహారానికి లేదా శిక్షకు గురిచెయ్యకూడదు. పేరా --------- వాక్యం ----------

**అధికరణం 7:** చట్టం ముందు అందరూ సమానులే, ఎటువంటి వివక్షతకు లోనుకాకుండా అందరికి చట్టం ద్వారా సమాన రక్షణ లభించాలి. ఈ ప్రకటనకు భంగం కలిగిస్తూ వివక్షతకు గురికాకుండా అందరికీ సమాన రక్షణ లభించాలి, ఇటువంటి వివక్షతకు రెచ్చగొట్టబడటం నుంచి కూడా రక్షణ లభించాలి. పేరా ------ వాక్యం ----

**అధికరణం 9:** ఎవరినీ అకారణంగా అరెస్టు చెయ్యకూడదు, నిర్బంధించకూడదు, బహిష్కరించగూడదు. పేరా-------- వాక్యం ---------

**అధికరణం 10:** ఒక వ్యక్తిపై మోపబడిన నేరాలకు అతడు/ ఆమె హక్కులు, బాధ్యతలు నిర్ణయించటానికి స్వతంత్ర, నిష్పక్షపాత ట్రిబ్యునల్ ద్వారా బహిరంగ విచారణకు పూర్తి సమానతతోకూడిన హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. పేరా ----- వాక్యం --------

**అధికరణం 12:** అకారణంగా ఎవరి ఏకాంతానికీ, కుటుంబానికి, నివాసానికి లేదా ఉత్తర ప్రత్యుత్తరాలకు అడ్డు పడకూడదు, జోక్యం చేసుకోకూడదు, వ్యక్తి పరువు, మర్యాదలకు భంగం కలిగించకూడదు. ఈ విధమైన దాడుల, జోక్యం చేసుకోవడాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరికీ చట్టం ద్వారా రక్షణ పొందే హక్కు ఉంటుంది. పేరా ----- వాక్యం ------

**అధికరణం 13:** (1) దేశ సరిహద్దులకు లోబడి ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా సంచరించే హక్కు, నివాసం ఏర్పరుచుకునే హక్కు ఉంటాయి. పేరా ------ వాక్యం -------

(2) ప్రతి ఒక్కరికీ సొంత దేశంతో సహా ఏ దేశాన్నైనా వీడే హక్కు, తిరిగి సొంత దేశానికి చేరే హక్కు ఉంటాయి. పేరా ------ వాక్యం ------

## చారిత్రిక నేపథ్యం

మణిపూర్ ప్రస్తుతం రెండు విలక్షణ భౌగోళిక ప్రదేశాలను కలిగి ఉంది: కొండలు, లోయలు. స్వాతంత్ర్యానికి ముందు లోయ ప్రాంతాలు రాచరిక పాలనలో ఉండగా కొండ ప్రాంతాలు ప్రధానంగా గిరిజన ప్రజలతో కొంత స్వయం ప్రతిపత్తితో ఉండేవి. 1891లో బ్రిటిష్‌వాళ్లు ఈ ప్రాంతంపై తమ నియంత్రణను సాధించారు, అయినప్పటికీ రాజుని పరిపాలించనిచ్చారు. మణిపూర్ రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేస్తూ రాజు 1949లో భారతదేశంతో ఒప్పందంపై సంతకం చేశాడు. ఈ ఒప్పందంతో అనేక తెగలు విభేదించాయి, తాము స్వయం ప్రతిపత్తితో జీవించామని, తాము భారతదేశంలో భాగం కావటానికి అంగీకరించబోమని వాదించసాగాయి.

భారతదేశంలో విలీనం కావటానికి వ్యతిరేకించిన వాళ్లను నియంత్రించటానికి భారత ప్రభుత్వం సైన్యాన్ని పంపించింది. శాంతి, భద్రతలను నెలకొల్పటానికి చేసిన చట్టాలలో ఒకటి సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం, 1958. దేశవిద్రోహ చర్యలలో పాల్గొంటున్నారన్న అనుమానం వస్తే ఆ వ్యక్తిని అరెస్టు చెయ్యటానికి, లేదా కాల్చి చంపటానికి భద్రతా సిబ్బందికి ఈ చట్టం అధికారాన్ని ఇస్తుంది. ఈ చట్టంలోని అంశాలు దుర్వినియోగమయ్యాయని, అమాయకులైన వ్యక్తులు తరుచు వేధింపులు, హింసకి గురయ్యారని, చంపబడ్డారని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా సాయుధ దళాలు మహిళలను దోపిడీ, అత్యాచారాలకు గురిచేశాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. దేశ విద్రోహ చర్యలలో పాల్గొంటున్నారన్న అనుమానంతో తమ కొడుకులను, భర్తలను నిర్బంధించి, హింసిస్తారన్న భయం కూడా మహిళలుగా, తల్లులుగా వీళ్లకు ఉండేది. తల్లులు, కూతుళ్లు స్వయంగా లైంగిక అత్యాచారానికి గురవుతున్నారు. ఇలా అత్యాచారానికి గురైన కొంతమంది మహిళలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తంగజం మనోరమ అనే 32 ఏళ్ల మహిళ నిర్బంధంలో చనిపోయినప్పుడు ఇది అందరి దృష్టినీ ఆకర్షించింది, దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి.

## మైరా పైబీ ఉద్యమం

మైటై భాషలో మైరా పైబీ అంటే కాగడాలు పట్టుకున్నవాళ్లు అని అర్థం. 1970ల చివరికాలంలో తాగి బజారుల్లో గొడవ చెయ్యకుండా నివారించటానికి మైరా పైబీ ఉద్యమం మొదలయ్యింది. 1980ల ఆరంభంలో మణిపురి స్వాతంత్ర్యానికి మొదలైన సాయుధ ఉద్యమాన్ని ఎదుర్కోటానికి భారతీయ సైన్యాన్ని పెద్ద ఎత్తున పంపించటంతో మానవ హక్కుల ఉద్యమంగా అది మార్పు చెందింది. అదే సమయంలో రాష్ట్రాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం కింద భారతీయ సైన్యానికి అంతులేని అధికారాలు ఇచ్చారు. దీని ఫలితంగా తరుచు సైనిక చర్యలతో మానవ హక్కులు ఉల్లంఘింపబడేవి. దీనికి నిరసన ప్రదర్శనలతో మైరా పైబీ వెంటనే స్పందించింది. రాత్రుళ్లు బజారులలో మైరా పైబీ పహరా తిరగటం మొదలుపెట్టింది. గ్రామాలు, పట్టణాలలోని వార్డులోని మహిళలు రోజూ ఈ పహరాలో పాల్గొనేవాళ్లు. అయితే వీళ్ల చేతుల్లో ఎటువంటి ఆయుధాలు కాకుండా కర్రకు గుడ్డచుట్టి, కిరోసిన్‌తో తడిపి వెలిగించిన కాగడాలు మాత్రమే ఉండేవి. ప్రజాశాంతికి భంగం, ముప్పు కలగకుండా మహిళా బృందాలు ప్రతి రాత్రి, ప్రతి వార్డులో, ప్రతి కూడలిలో కూర్చుంటాయి. కొంత శాంతియుత సమయాల్లో కొంతమంది మహిళలే వంతుల ప్రకారం పహరా ఉంటారు. కానీ ఉద్రిక్తతలు తీవ్రంగా ఉన్న తరుణంలో పెద్ద సంఖ్యలో మహిళలు కాపలా ఉంటారు. వీళ్లు ఉద్యమకారులు కాదు, వీళ్లకి రాజకీయ ఆకాంక్షలు ఏమీ లేవు. ప్రజల భద్రత, సంక్షేమానికి బాధ్యతను తమ చేతుల్లోకి తీసుకున్న



*చిత్రం 21.8 : ప్రదర్శనలో పాల్గొంటున్న మైరా పైబీ మహిళలు*

సాధారణ మహిళలు వీళ్లంతా. సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దు చెయ్యాలని కూడా మైరా పైబీ ఉద్యమం కోరుతోంది. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమం క్రమేపీ బలం పుంజుకుంది. ఎన్నికలను బహిష్కరించటం నుంచి రిలే నిరాహారదీక్షల వరకు తమ వ్యతిరేకతను అనేక రూపాలలో వెల్లడించారు. వీటిల్లో ఒక ఉదాహరణ ఇరోం షర్మిలా: ఈమె గృహ నిర్బంధంలో ఉన్నప్పటికీ 10 సంవత్సరాల కంటే ఎక్కువకాలంగా నిరాహార దీక్ష చేస్తోంది.

ఈ సమస్యను పరిష్కరించటానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. మాజీ సైనికాధికారులు కొంతమంది ఈ ప్రాంతంలోని వైరుధ్యాల గురించి రాస్తూ మెరుగైన మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు అభివృద్ధి చేయటం ద్వారా మాత్రమే ఈ ప్రాంత ప్రజల అంగీకారాన్ని పొందగలరని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఈ చట్టాన్ని రద్దు పరచటానికి ఉన్న అవకాశాలను పరిశీలించటానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తి అయిన బి.పి. జీవన్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ తన నివేదికను సమర్పించినప్పటికీ ఇప్పటికీ శాశ్వత పరిష్కారాన్ని కనుగొనలేదు.

## సామాజిక ఉద్యమాలన్నింటిలోని సారూప్య అంశాలు

పర్యావరణం, మానవ హక్కులు అన్న సరిహద్దులను చెరిపేస్తూ సామాజిక ఉద్యమాలు అనేక అంశాలను లేవనెత్తాయి. వాళ్ల వాదనలు ఈ వివిధ సూత్రాల నుంచి పుట్టుకొచ్చాయి. మహాలియా, లూథర్ కింగ్‌లు మానవ హక్కుల ఆదర్శాలతోపాటు పర్యావరణం, సమానత్వాలకు సంబంధించిన అంశాలను కూడా లేవనెత్తారని మీరు గమనిస్తారు. కొన్ని సందర్భాలలో తమపై రుద్దిన మార్పులను ఈ ఉద్యమాలు ప్రతిఘటించాయి. మార్టిన్ లూథర్ కింగ్, మైరా పైబి వంటి కొన్ని ఉద్యమాలు మార్పును కోరుకున్నాయి. సామాజిక ఉద్యమాలు సాధారణంగా రాజకీయ పార్టీలకు దూరంగా ఉండి ఒక ఆశయం కోసం కలిసి పనిచేస్తాయి. దాంట్లో పాల్గొంటున్న వాళ్లు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వాళ్లు కావచ్చు. తరచు ఈ ఉద్యమాల కార్యక్రమాలను భూస్వామ్య, ప్రజాస్వామిక పద్ధతుల్లో రూపొందిస్తారు. దేశంలో వేళ్లూనుకుని ఉన్న రాజకీయ వ్యవస్థలు తమ ఆశలను పూర్తిచెయ్యనప్పుడు లేదా పోరాడే అంశమున్నప్పుడు సామాజిక ఉద్యమాలు తలెత్తుతాయి.

## కీలక పదాలు

| | | | |
|---|---|---|---|
| పౌరహక్కులు | సహాయ నిరాకరణ | ప్రజలను వేరు చెయ్యటం | అస్థిర పరచటం |
| యుద్ధ వ్యతిరేకత | సైన్యంలో చేరే వయస్సు | సాయుధీకరణ | పునరావాసం |
| నష్టపరిహారం | సారా వ్యతిరేకత | ప్రజాస్వామిక | భాగస్వామ్యం |


## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. సామాజిక ఉద్యమాలపై ఒక పట్టిక తయారు చెయ్యటానికి ఇక్కడ కొన్ని అంశాలు ఉన్నాయి. వీటి ఆధారంగా పట్టిక తయారుచేసి వివిధ ఉద్యమాల మధ్య పోలికలు, తేడాలను గుర్తించండి:

   ఉద్యమం దృష్టిపెట్టిన ప్రధాన అంశం; ఎక్కడ జరిగింది; ప్రధాన కోరికలు; నిరసన తెలియచేసిన పద్ధతులు; ముఖ్యమైన నాయకులు; ప్రభుత్వం స్పందించిన తీరు; సమాజంపై ఉండే ప్రభావం.

2. కన్నయ్య, రమ్య, సల్మా ఒక విషయాన్ని చర్చిస్తున్నారు. వాళ్ల కోరికలు వేరు. మానవ హక్కుల కోణం నుంచి మీరు ఎవరితో ఏకీభవిస్తారో పేర్కొని మీ కారణాలను తెలియచెయ్యండి.

   ప్రజలు పేదరికంలో మగ్గకుండా చూడాలి, అందుకు అవసరమైతే పత్రికా స్వేచ్ఛను కొంతవరకు నియంత్రించినా ఫర్వాలేదని రమ్య అంటుంది. ఆహారం ఒక్కటే ఉంటే చాలదని, పత్రికా స్వేచ్ఛకూడా ఉండటం ముఖ్యమని లేకపోతే దేశ వివిధ ప్రాంతాలలో మానవ హక్కులు ఎక్కడైనా ఉల్లంఘింప బడుతున్నాయేమో తెలిసే మార్గమే ఉండదన్నది సల్మా వాదన. పత్రికలు ధనికులు, శక్తిమంతుల చేతుల్లో పత్రికలు ఉన్నప్పుడు ప్రయోజనం ఏమిటి, అవి సాధారణ ప్రజలకు సంబంధించిన అంశాలను ఎందుకు ప్రచురిస్తాయని కన్నయ్య అంటాడు.




3. సామాజిక ఉద్యమాల మౌలిక అంశాలు ఏమిటి?
4. పైన ఇచ్చిన ఉదాహరణలో సాధారణ ప్రజల పాత్రను ఎలా పేర్కొన్నారు?
5. అమెరికాలోని నల్ల జాతీయులు, మైరా పైబీ ఉద్యమాల మధ్య పోలికలు, తేడాలు ఏమిటి?
6. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక రాజకీయ వ్యవస్థలుగా ప్రజాస్వామ్యాలే ఉన్నాయి. ఇవి ప్రజల ఆకాంక్షలకు పూర్తి న్యాయం చేశాయా? ఈ అధ్యాయంలో ఇచ్చిన ఉదాహరణల ఆధారంగా 'ప్రజాస్వామ్యం – సామాజిక ఉద్యమాలు' అన్న అంశంపై చిన్న వ్యాసం రాయండి.
7. భోపాల్ గ్యాస్ దుర్ఘటన వంటి వాటి నేపధ్యంలో నిరసనలు, ఉద్యమాలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను ఎలా సమీకరిస్తారో తెలుసుకుని, చర్చించండి.